ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సెక్టార్ అధికారులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : సాధారణ ఎన్నికలకు సంబంధించి వల్నరబుల్ ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సెక్టార్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్‌ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌తో కలిసి హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసులకు తొలి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారుగా 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లను ఒక సెక్టార్ గా ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. సెక్టార్‌కు రెవిన్యూ శాఖకు చెందిన అధికారితో పాటు పోలీస్ శాఖ నుంచి ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో ఓటు హక్కు నమోదు, వినియోగం అత్యంత కీలకమని..ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎవరైనా అడ్డంకులను ఎదుర్కొనే సంఘటనలు గతంలో ఎక్కడైనా చోటుచేసుకుంటే ఆయా ప్రాంతాలపై ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారించాలని.. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ లు పూర్తి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీధర్ రెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, సెక్టార్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పేరు తప్పనిసరి

విశాలాంధ్ర - ఆలమూరు : కేంద్ర ఎన్నికల సంఘం డిసెంబర్ 2, 3 తేదీల్లో తలపెట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల పరిశీలన కార్యక్రమాన్ని తప్పని సరిగా వినియోగించుకుని, సక్రమమైన ఓటర్ల జాబితాల తయారీలో ఓటర్లు భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ ఐపి శెట్టి అన్నారు. శనివారం ఆలమూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో బూత్ లెవల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు పోలింగు బూతులవద్ద ఓటర్ల జాబితాల పరిశీలన చేపడతారని, ఓటర్లు అప్రమత్తంగా ఉంటూ చేర్పులు, మార్పులు, తొలగింపులు, సక్రమంగా ఉన్నదీ లేనిదీ చూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశం డిసెంబర్ 9వ తేదీ వరకు మాత్రమే కొనసాగుతుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై సమావేశం

విశాలాంధ్ర-పెరవలి : ఆడుదాం ఆంధ్రా గేమ్స్ పై మండల పరిషత్ అధ్యక్షులు కార్చెర్ల సీతారామ ప్రసాద్, ఎంపీడీఓ ఎస్ రమేష్ మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పలు శాఖల అధికారులకు సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రీడలకు సంబంధించిన కిట్స్ ఎంపీపీ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులకు అందచేశారు.

ఏపీ జేఏసీ మహిళా విభాగం ఏర్పాటు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ఏపి జేఏసి అమరావతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మహిళావిభాగం ఆవిర్భావ సమావేశం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈసమావేశంలో కోనసీమ జిల్లా మహిళావిభాగం కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా సిహెచ్ నాగలక్ష్మమ్మ, తహసీల్దారు ఐనవిల్లి ప్రధాన కార్యదర్శిగా జి కనకదుర్గ (గెజిటెడ్ హెచ్‌ఎమ్ ముంగండ)తో పాటు వివిధ డిపార్టు మెంటులకు చెందిన మరో 10 మందిని ఎంపికచేసారు. జిల్లా చైర్మన్ డి.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జి. చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపిజేఏసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, రాష్ట్ర మహిళా విభాగ చైర్ పర్సన్ పారేలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్మన్ ఎస్.శివకుమారి రెడ్డి, ట్రెజరర్ జి. పావని, కో చైర్మన్ కోటేశ్వరి, కో చైర్ పర్సన్ టీవి భవాని మరియు వివిధ సంఘ నాయకులు, అధికసంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే కోనసీమ జిల్లా 4వ తరగతి ఉద్యోగ జెఏసి నిర్మాణం జిల్లా అధ్యక్షులుగా కొప్పు సూరిబాబు (రెవెన్యూ డిపార్ట్మెంట్)ప్రధానకార్యదర్శి జోగి. గుఱ్ఱప్ప (భూ సర్వే), 5 గురు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా చైర్మన్ డి. శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

అమలాపురంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హైస్కూల్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ శనివారం అట్టహాసంగా ప్రారంభోత్సవం జరిగింది. స్పెషల్ అట్రాక్షన్‌గా వచ్చిన సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, అనసూయ సందడి చేశారు. వారితో ఫోటోలు దిగేందుకు యువకులు, మహిళలు పోటీ పడ్డారు. సినీతారలు పాయల్ రాజ్ పుత్, అనసూయ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రారంభోత్సవంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్. ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇశ్రాయిల్, ఐవి రావు, కలెక్టర్ హిమాన్షుశుక్లా, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, షాపు యజమాని ఇళ్ల భక్తవత్సలం, టీడిపి నాయకుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి ఆసుపత్రి ప్రారంభం

విశాలాంధ్ర - సామర్లకోట : గత ఏడు, ఎనిమిది సంవత్సరాలుగా సామర్లకోట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు విజన్ హాస్పిటల్ ద్వారా కరోనా సమయంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి అనేక సేవలు అందించడం జరిగిందని ఇప్పుడు నూత నంగా దృష్టి ఐ కేర్ హాస్పటల్ ప్రారంభిం చడం గర్వంగా ఉందని చైర్మన్ డాక్టర్ మహెూన్నత పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మహెూన్నతు మాట్లాడుతూ దృష్టి ఐ కేర్ ద్వారా కంటి సమస్యలను పరిష్కరించేందుకు ఆధునిక టెక్నాలజీతో ఆదివారం ఉదయం ప్రారంభిస్తున్నామని డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో దృష్టి ఐ కేర్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చంద్రబాబుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు

విశాలాంధ్ర - రాజానగరం : చంద్రబాబు తిరిగి అధికారం లోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, నియోజకవర్గం ఇన్ చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులను కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. టీడీపీ రూపొందించిన మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. తెలుగుదేశం, జనసేన కూటమిని ఆదరించి చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబురాయుడు, టీడీపీ రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులు వంకా మల్లికార్జున స్వామి(మల్లిబాబు),నాయకులు గంగి బ్రహ్మరాజు, పలివెల లక్ష్మణ్, మల్లారపు సత్యానందం, ఖండవిల్లి లక్ష్మి, పెనుగొండ చిన్ని, గేలం వీరవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం

- అభివృద్ధికి నోచుకోని రాజమహేంద్రవరం
- 9 ,500 కుటుంబాలను కలిసిన సీపీఐ జన చైతన్య యాత్ర

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా రాజమహేంద్రవరం నగరం ఉందని, నగరంలో అనేక ప్రజా సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, 9,500 కుటుంబాలను సీపీఐ జన చైతన్య యాత్రలో భాగంగా ప్రజలను కలిసిందని వారందరూ వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. నవంబర్ 20 నుండి డిసెంబర్ 2 వరకు జరిగిన సిపిఐ జనసైతన్య యాత్ర శనివారంతో ముగిసిందని నగరంలో 34 వార్డుల్లో ఈ యాత్ర జరిగిందని మధు తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నగరంలో చాలా కుటుంబాలు వారి పిల్లలకు ఉద్యోగాలు లేక నిరుద్యోగంతో అల్లాడిపోతున్నారని, డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుకుని చిన్నచిన్న కూలి పనులు చేస్తూ ఆటోలు నడుపుతున్నారని జగన్ వచ్చిన తర్వాత తమ జీవితం నాశనమై పోయిందని యువత తీవ్ర నిరాశలో ఉన్నారని మధు పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తానని, ప్రతి ఏడాది డీఎస్సీ తీస్తానని చెప్పి కనీసం ఏ ఒక్క పోస్టు ఇవ్వలేదన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు జగన్ పాలనలో అల్లాడుపోతున్నారని, ఇప్పటికీ ఇసుక కొరత తీవ్రంగా ఉందని అన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా జిల్లా ఏర్పడినా ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, వచ్చే మూడు నెలలు ఓపిక పడతామని ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ జనచైతన్య యాత్రకు సహకరించిన జట్లు లేబర్ యూనియన్ వాడికి బాడీకి పార్టీ నగర కార్యవర్గానికి ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు కొండ్రపు రాంబాబు సిపిఐ నగర కార్యదర్శి వి. కొండలరావు ఏఐఎస్ఎఫ్ నగర కన్వీనర్ స్టాలిన్, డి హెచ్ పి ఎస్ జిల్లా కన్వీనర్ ఎం. సాగర్. మహిళా సమైక్య జిల్లా కోకన్వీనర్ ఎం. ముత్యాలు, జట్ల సంఘం కమిటీ నాయకులు సురేష్, సతీష్, ప్రసాద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పంట కోతలను వాయిదా వేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : వాతావరణ శాఖ జారీ చేసిన మిచౌంగ్ తుఫాను హెచ్చరిక దృష్ట్యా జిల్లాలో ఖరీఫ్ పంట కోతలను ఈ నెల 6వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా రైతులను కోరారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర తీర జిల్లాలకు మిచౌంగ్ తుఫాను తాకిడి హెచ్చరిక నేపథ్యంలో పాటించవలసిన అప్రమత్తత, సహాయ రక్షణ చర్యలను సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ పాల్గొని జిల్లాలో చేపట్టిన తుపాను నియంత్రణ కార్యాచరణను వివరించారు. తుపాను హెచ్చరిక దృష్ట్యా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, కలెక్టరేట్‌తో పాటు కాకినాడ, పెద్దాపురం ఆర్డిఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఖరీఫ్ కోతలు పూర్తయి పొలాల్లోను, కళ్లాల్లోను ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని రైతులకు సూచించామన్నారు.

పేదలను భూస్వాముల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ/ కే గంగవరం : భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి భూస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే షేర్ లంక గ్రామంలో 277 మంది పేద రైతులకు లీజుపై పట్టా పంపిణీ కార్యక్రమంతో నూతన అధ్యాయానికి నాంది పలికామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కే గంగవరం మండలంలోని షేర్లంక గ్రామంలో 277 మంది రైతులకు ఐదు సంవత్సరాల లీజుపై పట్టాల పంపిణీ కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. పేదలకు ఆసరాగా ఉండటమే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, అందులో భాగంగానే ఈ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వపరంగా ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గోదావరి లంక గ్రామ పేద రైతాంగానికి చేదోడుగా ఉండే విధంగా ప్రభుత్వం పట్టా భూముల లీజు ఇచ్చే విధంగా పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని లంక భూముల్లో జీవనం సాగించే పేద రైతాంగాన్ని ఆదుకునే విధంగా పట్టా భూముల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చేశామన్నారు. లంక గ్రామాల పేద రైతులు తమకు భూమి ఉన్నదని ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. లంక గ్రామాల్లో ఉన్న యువత ఉద్యోగాల ప్రయత్నంతోపాటు ఉపాధి అవకాశాల పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పందు గోవిందరాజు, ఎంపీపీ కొండేటి అప్పారావు, గ్రామ సర్పంచ్ కొండేటి భద్రరావు తాసిల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 277 మందికి సి క్లాస్ లంక భూముల్లో ఐదు సంవత్సరాలు లీజు ఉండే విధంగా పట్టాలను ఆయా లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : నాలుగున్నరేళ్ల సీఎం జగనన్న ప్రభుత్వంలో చేసిన మంచి పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 10 వేల మందికి పైగా విద్యార్థులతో శనివారం రాజమండ్రిలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామాలయం వరకు ముప్పై నిమిషాలపాటు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగింది. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానిగంటి చైతన్యరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "విద్యాసంస్థలను తీర్చిదిద్దిన సీఎం జగన్ రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా మార్చివేశారని అన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ధీటుగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు నాయకత్వంలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగం సీఎం జగన్ పాలనలో ప్రాధాన్యత సంతరించుకుందని, మన బడి నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, విద్య కానుక, విద్యా దీవెన వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో సీఎం జగన్ రాష్ట్రంలో విద్యారంగాన్ని విప్లవాత్మకంగా మార్చారని స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



విశాలాంధ్ర - సీతానగరం: మండల వ్యాప్తంగా పోలింగ్‌కేంద్రాలను శనివారం తహశీల్దార్ పి. కృష్ణా రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణా రావు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సీతానగరం మండ లంలో ఉన్న ఒకటి నుండి 61 పోలింగ్ కేంద్రాలను శనివారం ఆ గ్రామాల సూపర్వైజర్లు(పంచాయితీ కార్యదర్శిలు) లతో కలిసి తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ మూర్తి, అర్ ఐ లక్ష్మి దేవిలు తనిఖీ చేశామని అన్నారు. దీనిలో భాగంగా స్థానిక బి ఎల్ ఓ లు అందుబాటులో ఉంటున్నారా లేదా, ఓటర్ల నమోదు జరుగుతుందా లేదా, ఓటర్లు ఇస్తున్న అర్జీలను స్వీకరణ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. కేంద్రాల వసతులు, గేట్లకు తాళాలు వేసిన బిఎల్‌ఓలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఈ కార్యక్ర మంలో అన్ని గ్రామాల బిఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శిలు, విఆర్‌ఓలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తం కావాలి

విశాలాంధ్ర - కరప : అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలియ జేయడంతో రైతులు అప్రమత్తం కావాలని తహసీల్దార్ పొన్న మండ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు. శనివారం కరప మండలంలోని పలు ప్రాంతాలలో ఉన్న దాన్యపు రాశుల వద్దకు వెళ్లి రైతులను అప్రమత్తం చేశారు. రైతులు మూడు రోజులు పాటు ఆఫ్లైన్లో ధాన్యం కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని దగ్గర్లో ఉన్న రైస్ మిల్లులకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని తెలిపారు. దీనిలో భాగంగా ధాన్యం యొక్క తేమ శాతం 15% ఉండాలని తెలిపారు.

సంపద తయారీ కేంద్రాల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే చర్యలు

విశాలాంధ్ర - పెద్దాపురం : మండలంలోని ఏ గ్రామంలోనైనా సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక కార్యకలా పాలు సాగిస్తున్నట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె. రాజ శేఖర్ హెచ్చరించారు. మండలం లోని కట్టమూరు, కాండ్రకోట సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సందప తయారీ కేంద్రాల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కట్టమూరు సంపద తయారీ కేంద్రం వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై మండి పడ్డారు. సత్వరమే డంపింగ్, చెత్త రోడ్డపై లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. షెడ్ నిర్మాణాలకు అవసరమైన నిధులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాజశేఖర్ అన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి రాధాకృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ బందారు చంటిబాబు, నల్లల గోవిందు తదితరులున్నారు.

ఈవిఎంలపై అవగాహన

విశాలాంధ్ర - పెద్దాపురం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ సీనియర్ సహాయకులు జగన్నాధం, మహేష్‌లు కార్యాలయ ఆవరణలో ఓటు ప్రక్రియ, ఈ విఎంల పనితీరు, ఓటు వేసే విధానం, ఎన్నికల నియమావళిపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. ప్రజలకు ఆసక్తిగా ఈవిఎంల పనితీరుపై శ్రద్ధగా విని అవగాహన ఏర్పర్చుకుంటున్నట్లు వారు తెలిపారు. పట్టణంలోని ఓటర్లు అందరూ అవగాహనా కేంద్రం వద్దకు వచ్చి ఈవిఎంపై ఓటు వేసే విధానంపై మరింత అవగాహన ఏర్పర్చుకోవాలని జగన్నాధం కోరారు.

ఆ భూమి మాదే !

విశాలాంధ్ర - కాకినాడ : కోర్టు పరిధిలో ఉన్న తమ పూర్వార్జిత భూమి, ఏ ఒక్కరికి సంబంధం లేదని తప్పుడు పత్రాలు కలిగిన చలికి వీరేంద్ర అనే వ్యక్తి దొంగ రిజిస్ట్రేషన్ చేయించు కున్నాడని కాకినాడ చిడిలపొరలోని సర్వేనెంబర్ 195/3 ఒక ఎకరం భూమి గల భూ యజమాని ముమ్మిడి దుర్గా రాజు పేర్కొన్నారు. ముమ్మిడి దుర్గా రాజు, ముమ్మిడి వెంకటేశ్వరరావు ముమ్మిడి సత్యనారాయణ, ముమ్మిడి బుల్లి అప్పారావు, ముమ్మిడి ప్రభాకర్, జిడ్డి సరోజిని, నక్క కుమారి, వీరారెడ్డి వరలక్ష్మి మొత్తం ఎనిమిది మంది ఈ భూమికి హక్కుదారులై ఉన్నామని ముమ్మిడి దుర్గారాజు తెలిపారు. పిఠాపురం మహారాజు వారి దివాణంలో తమ పూర్వీకులు తాపీ పనులు చేయగా దానికి ప్రతిఫలంగా పిఠాపురం రాజావారు పట్టా నెంబర్ 14, 28 రూపేనా కొంత భూమి ఇచ్చారని, గతంలో ఈ భూమిలో తాము వ్యవసాయం చేశామని అటువంటి భూమి మా పొజిషన్లో ఉండగా కొంతమంది వ్యక్తులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వెంటనే న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యలు శరణ్యమని, ఉన్నతాధికారులు తమ భూముల విషయంలో స్పందించి పూర్వార్జిత భూముల జోలికి వస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముమ్మిడి దుర్గా రాజు వేడుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలి అని, లింగ వివక్షత పోవాలని జిల్లా మహిళా సమాఖ్య నాయకులు జే రోజా, కే దుర్గా భవాని, బీ శాంతి కుమారిలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పేదరిక నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు మామిడికుదురు మండల మహిళా సమాఖ్య ఆధ్వ ర్యంలో పాసర్ల పూడిలో మానవహారం ఏర్పడి, జెండర్ ర్యాలీ ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహిం చారు. లింగ వివక్షత లేకుండా పిల్లల్ని చదివించాలని, రక్త హీనత తగ్గించాలని, ఆడపిల్లను 21 సంవత్స రాలు వచ్చే వరకు చదివిం చాలని, అత్యాచారాలు అరికట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, సిసి, అకౌంటెంట్, వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

పోయినది

తెలంగాణా రాష్ట్రం మేడ్చల్ జిల్లా, బాచ్‌పల్లి , ఆగం నాయక కాంప్లెక్స్, సాయినాద్ హెూమ్స్, ప్లాట్ నెం 304 , ఎస్.వై 307/ఎ/2 కాపురస్తులు పంచదార్ల అరుణ (భర్త) అప్పలరాజు అనువారు ది. 16-09- 2023వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లా , ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామం నుండి ప్రత్తిపాడు గ్రామమునకు బస్సులో ప్రయాణిస్తుండగా బ్యాగులో ఉన్న ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన సర్వే నెం 177/3లో యు 1-14ట్లు భూమికి సంబంధించిన ది.21-02-2006వ తేదీన ప్రత్తిపాడు సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రీ కాబడిన నెం. 366/2006 గల క్రయదస్తావేజు ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికిననూ కనిపించలేదు. కావున సదరు డాక్యుమెంటు ఎవరికయినా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాలో అందజేసిన తగు బహుమానం ఇవ్వబడును.

ప్లాట్ నెం 304 , ఎస్.వై 307/ఎ/2 సాయినాద్ హెూమ్స్, ఆగం నాయక కాంప్లెక్స్, మేడ్చల్ జిల్లా, బాచ్‌పల్లి , తెలంగాణా రాష్ట్రం ఫోన్ నెం - 7893663719

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

-కమిషనర్ నాగనరసింహారావు ఆదేశం
-టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4255 990 కాల్ చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అప్రమ త్తంగా ఉండాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అదికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం వివిధ విభాగాధిపతులు, ప్రత్యేకాధికారులతో ఈ అంశంపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న ఒకటి రెండు రోజుల్లో ఈదురుగాలులు, భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఆయా డివిజన్లకు చెందిన ప్రత్యేకాధికారులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్థంబాలు, హెూర్డింగ్‌లు పడిపోవడం వంటి సంఘటనలు ఎదురైతే తక్షణమే సమస్య పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న డివిజన్లలో ముంపునకు గురికావడం, వర్షాలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురైతే సామాజిక భవనాలు, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కార్పొరేషన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.అక్కడ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, కార్యదర్శి ఎం. ఏసుబాబు, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృద్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మనే కృష్ణ మోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఏవో శిరీష్, ఈఈలు మాధవి,వెంకటరావు, డిఈలు, ఏఈలు, వివిధ విభాగాధిపతులు సమావేశంలో పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి: లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు లబ్ధిదారులను కోరారు. దేవరపల్లి జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా కేవీకే దుర్గారావు మాట్లాడుతూ దేవరపల్లిలో 27 ఎకరాలలో 1100 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 300 మంది ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టారని మిగిలిన వారు అతి త్వరలోనే పనులు చేపడతారని తెలిపారు. జగనన్న లేఔట్ లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా మని ముఖ్యంగా రోడ్లు డ్రైన్లు విద్యుత్తు సమకూర్చినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ వేగవంతంగా చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ఇంటింటా తిరిగి పరిశీలించారు. ఎంపీపీ దుర్గారావుతో పాటు వైసీపీ నేతలు దుగ్గిని గంగాధరరావు, పచ్చ రాంగోపాల్, కవల శ్రీనివాస్, మాధవరపు వెంకటేశ్వరరావు, కామిశెట్టి దుర్గారావు కడిమి రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చాంబర్ అధ్యక్షులుగా ఉషారాణి

విశాలాంధ్ర-దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ సర్పంచ్ చాంబర్ అధ్యక్షురాలుగా టిడిపి దేవరపల్లి మండలం సంగాయి గూడెం సర్పంచ్ కరుటూరి ఉషారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో గోపాలపురం నియోజకవర్గ సర్పంచ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవరపల్లి మండలం సంగాయిగూడెం సర్పంచ్ కరుటూరి ఉషా రాణిని గోపాలపురం నియోజకవర్గ సర్పంచ్ చాంబర్ అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సర్పంచ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు వైబి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా పిచ్చికల గణపతి, ప్రధాన కార్యదర్శిగా జాన్ విక్టర్, కార్యదర్శిగా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన నూతంగి దొరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దేవరపల్లి మండల సర్పంచ్ చాంబర్ అధ్యక్షునిగా దుర్గాప్రసాద్

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షునిగా కృష్ణంపాలెం సర్పంచ్, జనసేన నాయకుడు నాయుడు దుర్గాప్రసాద్ ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం, జనసేన సర్పంచుల సమావేశంలో దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా బంధపురం సర్పంచ్ కాట్రగడ్డ పరమేశ్వరరావు గాంధీ ప్రధాన కార్యదర్శిగా కురుకూరి సర్పంచ్ కార్య నిర్వహణ అధికారిగా త్యాజంపూడి ఎంపీటీసీ కాళ్ల వెంకటరత్నం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన దేవరపల్లి మండల సర్పంచ్ అధ్యక్షుడు నాయుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో సర్పంచ్ సమస్యలు 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాలలో వివిధ సమస్యలపై ప్రభుత్వంపై న్యాయమైన పోరాటం చేస్తామని అన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా సాయి కిషోర్

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండల పరిధిలోని పెద్దపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వితీయ వైద్యాధికారిగా డి.సాయి కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడకు చెందిన ఆయనకు ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమీషనరేట్ పర్యవేక్షణలో విజయ వాడలో జరిగిన వైద్యుల నియామక కౌన్సిలింగ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆరు నెలల వ్యవధిలోనే తొలిసారి స్థానిక వైద్యాధికారిగా ఆయనకు పోస్టింగ్ లభించింది. స్థానిక వైద్యారోగ్య అధికారులు, సిబ్బందితో కలిసి పేదల ఆరోగ్య రక్షణకు తన వంతు కృషి చేస్తానని వైద్యాధికారి పేర్కొన్నారు.

అర్చకుల వసతి గృహాలకు రూ. 50వేల విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మాణం తలపెట్టిన అర్చకుల వసతి గృహాలకు అమలాపురానికి చెందిన గండు బాల వెంకటేశ్వరరావు, అనంతలక్ష్మి సత్యభామ దంపతులు 50వేల రూపాయల చెక్‌ను ఆలయ చైర్ పర్సన్ దూడల విరీతదేవి ఫణికి అందజేశారు. ఈ సందర్భంగా విరీతదేవి మాట్లాడుతూ అర్చక క్వార్టర్స్ నిర్మాణంలో దాతలు అందరూ భాగస్వామ్యం కావడం చాలా గొప్ప విషయమని ఆమె అన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు లక్షలాది రూపాయలు విరాళాలు ఇస్తున్నారని దాతలు అందరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు, పట్టణ వైఎస్సార్సీపీ యువత అధ్యక్షులు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం పురపాలక సంఘం
ఇంజనీరింగ్ విభాగం
ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

ఆర్.ఒ.సి. నెం. 108/2022-E1 తేదీ : 01.12.2023.

పెద్దాపురం పురపాలక సంఘ పరిధి లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో 5 పనులు, 15వ ఆర్థిక సంఘం 2022-23 నిధులతో 6 పనులు, సాధారణ నిధులతో 4 పనులను మొత్తం రూ.68,80,813/-లతో ఇ- ప్రొక్యూర్ మెంట్ ద్వారా టెండర్లు కోరడమైనది.

బిడ్ డాక్యుమెంట్ లభ్యత (ఆన్‌లైన్)	:	ది. 30.11.2023 తేదీ సాయంత్రం 8.00 గం. ల నుండి
బిడ్ దాఖలు ముగింపు తేదీ	:	ది. 08.12.2023 తేదీ సాయంత్రం 5.00 గం. ల వరకు

ఇతర వివరములు : www.tender.apeprocurement.gov.in
Phone Nos. 9849905811, 9849907062

కమిషనర్, పెద్దాపురం పురపాలక సంఘం

ఖరీఫ్ సాగుదారులకు తుపాను భయం

విశాలాంధ్ర-మండవల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఇంటికి తీసుకువచ్చే సమయంలో విపత్తులు రావటం పరిపాటిగా మారింది. ఈఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలో సకాలంలో వర్షాలు రాక నీటిసమస్యలను రైతాంగం ఎదుర్కొన్నారు. సెప్టెంబరు,అక్టోబరు నెలలో తీవ్ర వర్షాభావానికి తోడు పంట కాలువలకు వంతుల వారీగా నీటివిడుదలతో పంటను రక్షించుకవటానికి రైతాంగం నానా పాట్లు పడ్డారు. మండలంలో సుమారు 4వేల ఎకరాల్లో సార్వా వరి సాగు జరగగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నాలుగు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే సుమారు రెండు వేల ఎకరాలకు పైబడి వరి కోతలు ,మాసూళ్ళు పూర్తవ్వగా రెండవ పంటగా అపరాలు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. దీపావళి తరువాత తుఫాన్ ఏర్పడినా ఆంధ్రరాష్ట్రంలో నామమాత్రపు ప్రభావం చూపటంతో వెద సాగు రైతులు కోతలు కోశారు. ఆలస్యంగా నాటిన వరిపైర్లు డిశెంబరు నెలలో కోతకు రానుండటంతో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి సాగుదారులు తీవ్రంగా కలత చెందుతున్నారు. శనివారం, ఆదివారం నుండే భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో పాటు మచిలీపట్టణం సమీపంలోనే తీరాన్ని దాటుతుందనే వార్తలు రైతుల్ని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.ప్రమాద హెచ్చరికలు జారీచేస్తుండటంతో పాటు రైతాంగం పంటను రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తుండటంతో ఖరీఫ్ సాగుదారులు పంటను దక్కించుకునే క్రమంలో నిమగ్నమయ్యారు వాతావరణంలో మబ్బులు, కూలీల కొరతతో సమస్యలు మరింతగా పెరిగాయి.పంట కోసిన పొలాల్లో వరిగడ్డిని తరలించేందుకు రైతులు కుస్తీలు పడతుండగా కొందరైతే వరిగడ్డిని తగులబెడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వానలు కురిస్తే రైతులు భారీగానే నష్టపోవాల్సి వస్తుందనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి.

దివ్యాంగ పిల్లలకు ట్యాబుల పంపిణీ

విశాలాంధ్ర- ఉంగుటూరు: సమ్మిళిత విద్యా కార్యక్రమాలతో విభిన్న ప్రతిభా వంతులకు ఎంతో మేలు కలుగుతుందని ఉంగుటూరు ఎంపీడీవో ప్రేమాన్విత అన్నారు. ఉంగుటూరు ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఉంగుటూరు మండల సచివాలయ కన్వీనర్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ ఎంపీటీసీ సందక రాంబాబు, ఎంఈఓ శ్రీనివాస్ వికలాంగులైన పిల్లలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ట్యాబులను పంపిణీ చేశారు. హెచ్ఎం పెద్దిరాజు, విలీన ఉపాధ్యాయులు రాజు, విమలలు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

విశాలాంధ్ర- తణుకు: పాతవూరు శ్రీఉమా సిద్దేశ్వర స్వామి ఆలయం ముందు మేలు చేయరా సోదరా బిసి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రండి అప్పారావు,సంఘ సభ్యులు, వావిలాల సరళా దేవి తదితరుల ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా భారీ వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 15000 మందికి పైగా పాల్గొని జయప్రదం చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం మహిళా సేవకులు పాల్గొన్ని వారి సేవలను అందజేశారు. సంఘ పెద్దలు,వావిలాల సరళా దేవి దేవస్థానం మహిళా సేవకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ , వీవర్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళా దేవి, పి బి ఆర్ తదితరులు పాల్గొన్నారు.సంఘ గౌరవ అధ్యక్షులు ఎన్. నారాయణ రాజు, షేక్ మస్తాన్, సెక్రటరీ చిలికోటి శ్రీనివాస్ , రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ రండి ప్రసాద్, టౌన్ ప్రెసిడెంట్ నంది, బీసీ సోదరి సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జీలుగుమిల్లి తహసిల్దార్ జి. సుందర్ సింగ్ సూచించారు. శనివారం జీలుగుమిల్లి హైస్కూల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు లక్ష్మీ ప్రసన్న, కన్నయ్య కస్తూరి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో సిబ్బంది కొరత

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ఫారెస్ట్ సిబ్బంది కొరత గానే ఉందని సబ్ డి ఎఫ్ ఓ ఏ వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం జీలుగుమిల్లి ఫారెస్ట్ చెక్ పోస్టను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫారెస్ట్ సిబ్బందిని నియమించే వరకు సిబ్బంది కొరతగానే ఉంటుందని అన్నారు. చెక్ పోస్ట్ రికార్డులను పరిశీలించారు. ఆయనతోపాటు జీలుగుమిల్లి గార్డు జి.మారేషు, చెక్‌పోస్టు సిబ్బంది రహమత్ ఉన్నారు.

జనరల్ నాలెడ్జి పోటీలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-పెనుగొండ: న్యూఢిల్లీ వారు ఏలూరులో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహించిన జనరల్ నాలెడ్జి పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులు మొదటి స్థానం సాధించారాని ప్రధానోపాధ్యాయుడు వెంకట అప్పారావు తెలిపారు. పెనుగొండ భాష్యం నుండి నాయుడు రఘురాం(మూడవ తరగతి), కొవ్వూరు కళ్యాణ సాయి రెడ్డి(మూడో తరగతి), కర్ణి దీక్ష (నాలుగో తరగతి) పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీతో పాటు ప్రశంశా పత్రం, ఎడ్యుకేషన్ ఆంధ్రజ్యోతి ప్రదీప్ జనరల్ మేనేజర్ మెహతా, భాష్యం జోనల్ ఇన్చార్జ్ ఏ.శ్రీమన్నారాయణ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జి రాణి రోజాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవతకు మార్చురీ ఫ్రీజర్ వితరణ

విశాలాంధ్ర-పెంటపాడు: పెంటపాడు మండలానికి చెందిన రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు శనివారం మార్చురీ ఫ్రీజర్ బహుకరించారు. పీసీసీ మాజీ అధ్యక్షులు దివంగత తాడేపల్లి ముసలయ్య, కృపమ్మ జ్ఞాపకార్ధం వారి కుమారుడు పెంటపాడు రిటైర్డ్ ఆంధ్రా బ్యాంక్ మేనేజర్,పశ్చిమగోదావరి జిల్లా మానవత అధ్యక్షులు తాడేపల్లి మోహన రావు, కోడలు సూర్య చంద్ర కుమారి సౌజన్యంతో ఫ్రీజర్ బహుకరించారు. మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్ . రామచంద్ర రెడ్డి చేతుల మీదుగా రూ.70 వేల విలువ గల మార్చురీ ఫ్రీజర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడు మోహన్ రావు అని, మానవసేవే మాధవసేవఅని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆత్మీయ కమిటీ జిల్లా చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, మానవతా ఎడిటోరియల్ చైర్మన్ రామిశెట్టి గంగాధరరావు, కడప జిల్లా మానవతా అధ్యక్షులు ఎన్.రామాంజనేయరెడ్డి, ఉండి మండల మానవతా అధ్యక్షులు యువరాజ్, ఉండి మండల కన్వీనర్ వి.వినాయక్, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా చాటపర్రు గ్రామంలోని శ్రీ మాగంటి ఆంజనేయ సత్యవతి జిల్లాపరిషత్ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా 8,9 తరగతుల విద్యార్థినిలకు యూనిట్ పరీక్షలకు సంబంధించిన వారు వ్రాసిన జవాబు పత్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎమౌంట్ ఆఫ్ మనీ, స్పెంట్ ఫ్యామిలీ అనే ఇంగ్లీషు ప్రశ్నను ముగ్గురు విద్యార్థులను తెలుగులో వాటి సమాధానాన్ని అడిగారు. విద్యార్థులను ముఖా ముఖిగా పెట్టి ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్ లు ఇవ్వడం ద్వారా దాని ఉపయోగం గురించి వారిని సంభాషించమని కలెక్టర్ అడిగారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు పూర్తిగా ట్యాబ్‌లోనే వారి పాఠ్యాంశాలను ఉంచడం ద్వారా పుస్తకాల బరువు తగ్గడం, సాంకేతికమైన విద్య ద్వారా మేథాశక్తిని పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిందని వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని విద్యలో రాణించాలని కోరారు. అనంతరం హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సందర్శించడం జరిగింది. కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాస్, బూత్ లెవల్ అధికారులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని 214 పోలింగ్ కేంద్రాల వద్ద శని,ఆదివారాలలో బిఎల్ఓ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ సేవలను వినియోగించుకోవాలని ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కే ఖాజావలి కోరారు. శనివారం ఆయన భీమడోలు మండల పర్యటనలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 91 ,92 ,93, 94 వద్ద కొనసాగుతున్న కార్యక్రమ సేవలను పరిశీలించారు. బిఎల్వోలకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను తెలుసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై దరఖాస్తులు అభ్యంతరాలను ఈ నెల 9వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై జాబితాలో వారి వివరాలు ఉండేలా బాధ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమడోలు డిప్యూటీ తహసిల్దార్ షంషుద్దీన్ ,గ్రామ రెవెన్యూ అధికారులు సాల్మన్ రాజు, వెజ్జు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ తెలిపారు. పొలంబడి క్షేత్ర దినోత్సవం సందర్భంగా భోగోలులో రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడి తక్కువ అవుతుందని దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. పండించిన పంట నాణ్యతగా ఉండటంతో పాటు కల్తీ లేని వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులకు అందించవచ్చని తెలిపారు. రైతులు దీనిపై అవగాహనతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి సమాఖ్య చైర్మన్ ఇనుగంటి రంగారావు, పంచాయతీ కార్యదర్శి నాగదుర్గ వెంకటేశ్వరి, వ్యవసాయ సహాయకులు బొల్లవరపు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

విశాలాంధ్ర -భీమవరం: నిజాయితీగా ఓటు వేసినప్పుడే ప్రజా స్వామ్యానికి రక్షణని, ఓటు నమోదు చేయించుకోవడం యువత కర్తవ్యమని ఆర్.ఆర్.డి.ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వికెజే ప్రసూన అన్నారు. భీమవరం రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో కళాశాలలో ఓటు విలువ ప్రాముఖ్యత, ఓటు నమోదులపై ప్రచార భేరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం చెరుకువాడ రంగసాయి విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించి ప్రచార భేరి ర్యాలీ నిర్వహించారు.

కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: పంచాయతీ కార్యదర్శులు గ్రామ పరిపాలనను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అంకితభావంతో పనిచేయాలని పాలకొల్లు మండల ఈవోపీఆర్ అండ్ ఆర్డీ వైభవతి అన్నారు. శనివారం పాలకొల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యదర్శుల సర్పంచ్‌ల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ చాలామంది కార్యదర్శులు పంచాయతీలకు సక్రమంగా హాజరు కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

వెలమ సామాజిక వర్గానికి సముచిత స్థానం

విశాలాంధ్ర-ఏలూరు : వెలమ సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించినట్లు ఉప ముఖ్య మంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్థానిక లూనాని నగర్లో శనివారం కొప్పుల వెలమ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, స్థానిక శాసనసభ్యులు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) తో కలిసి ముత్యాలనాయుడు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కొప్పుల వెలమ సామాజిక వర్గం అభివృద్ధికి కూడా కృషిచేస్తున్నారని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కుల, మత ,ప్రాంత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గ వర్గ ప్రజలకు సముచిత స్థానం పెద్ద పేట వేశారు అనడానికి జడ్పీ చైర్మన్ అయిన తానే నిదర్శనం అన్నారు. మాజీ ఉపముఖ్య ముఖ్యమంత్రి ఆళ్ళ నాని మాట్లాడుతూ కొప్పుల వెలమ సామాజిక ప్రజలకు రాజకీయ లబ్ధి కోసం స్థలం అందించలేదని ఆ సామాజిక వర్గ ముఖ్య నేతలు తెలిపిన మీదట వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తానూ మండపానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు.వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గంటా ప్రసాద్ రావు, మాజీ మంత్రి మరడాని రంగారావు వెలమ సామాజిక వర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు మేక ప్రతాప అప్పారావు , నాగేశ్వరరావు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొటారు రామచంద్రరావు, ఉంగుటూరు జడ్పీటీసి విజయలక్ష్మి శ్రీనివాస్, ఉంగుటూరు ఏఎంసి చైర్ పర్సన్ రమావతి ఆకివీడు మున్సిపల్ చైర్మన్ జామి హైమావతి శ్రీనివాస్ మండల కళ్యాణ మండప నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దింటి నీలకంఠేశ్వరరావు కంద్రిక గూడెం సర్పంచ్ లచ్చిరెడ్డి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరుగా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - కరప : జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాల నిండిన వయోజనులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం కరప గ్రామంలోని 66వ పోలింగ్ కేంద్రం నందు ఓటరు పరిశీలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బూత్ లెవెల్ అధికారులకు సూచనలు సలహాలు అందించారు. కొత్త ఓటర్లుగా పురుషులు 62, స్త్రీలు 61 ఫారం సిక్స్ నింపి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఫారం సెవెన్ నందు 29 మంది పురుషులు 19 మంది మహిళలు క్లైమ్ లు ఇచ్చినట్టు తెలిపారు. ఫారం 8లో 28 మంది పురుషులు, 26 మంది మహిళలు మార్పులు చేర్పులు చేసుకునేందుకు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాచర్రావు, వీఆర్వో రామకృష్ణారెడ్డి, బిఎల్వోలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొల్లపుంతలో కార్తీక వనసమారాధన ఏర్పాట్లు

విశాలాంధ్ర - మండపేట : వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యుల కార్తీక వన సమారాధనకు ప్రజలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. డిసెంబర్ 10న భారీ ఎత్తున నిర్వహించే వైసీపీ కుటుంబ సభ్యుల కార్తీక వన సమారాధనకు గొల్లపుంత రోడ్డులోని సంకా సుధాకర్ లే అవుట్ వేదిక కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్సీ తోట ఆ పార్టీ నాయకులు రెడ్డి రాజబాబు, మేకా శ్రీనివాస్, పతివాడ రమణ, కాళ్లకూరి నాగబాబు, కొమ్ము రాంబాబు, దేవు ప్రసాద్ నాయుడు, మెండు బాపిరాజు, మీగడ శ్రీనివాస్ ఇతర నాయకులతో కలిసి సమారాధన ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాట్ల కోసం నాయకులతో కలిసి చర్చించారు. ద్రాక్షారామ నుంచి నిష్ఠాతులను పిలిపించి భోజన ఏర్పాట్ల బాధ్యత అప్పగించారు. నాయకుల సలహాలు తీసుకున్నారు.

కోనసీమ శెట్టిబలిజ వన సమారాధన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఈనెల 10వ తేదీ ఆదివారం అమలాపురం, కొంకాపల్లి సత్యమ్మ తల్లి గుడి వద్ద నిర్వహించే కోనసీమ శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధనకు ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని శెట్టి బలిజ సంఘం నాయకులు, ఎస్ఏఎఫ్ అధినేత వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శనివారం కాట్రేనికోన మండలంలోని పల్లంకురు, కందికుప్ప, కాట్రేనికోన, దొంతి కుర్రు, కొప్పిగుంట, కుండలేశ్వరం ,వేట్లపాలెం తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఆహ్వాన కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి ఆనందరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పితాని వెంకటరావు, విల్ల సత్తిబాబు, కముజు సర్వేశ్వరరావు, మట్టపర్తి గణేష్, వాసంశెట్టి రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా రామకృష్ణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నాలుగవసారి దుద్దుకూరు గ్రామానికి చెందిన వెలగా రామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ్ కుమారి ధ్రువపత్రం అందజేశారు. వెలగ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీలో గత 40 సంవత్సరాలుగా వివిధ పదవులు అలంకరించారు. 1985 నుండి గోపాలపురంనియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పాల్గొని ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా వెలగా రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలో ఉండటం తన అదృష్టమన్నారు. రాబోవు లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

సమృద్ధ భారత్ కోసమే సంకల్పయాత్ర

విశాలాంధ్ర - అనపర్తి : సమృద్ధ భారత్ కోసమే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిందని బిజెపి మండల అధ్యక్షులు తాడి గంగిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పేరా రామచంద్రపురం, దుప్పలపూడి గ్రామాల్లో సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, రాజేష్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళి రక్షణకై అవతరించిన జీసస్

విశాలాంధ్ర - గోపాలపురం : మానవాళి రక్షణార్థమై ఏసుక్రీస్తు లోక రక్షకుడిగా అవతరించడమే క్రిస్మస్ వేడుక అని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రిటైర్డ్ డిజిఎం ఎంజెకె మోహన్ తెలిపారు. మండలంలోని వాదాల కుంట శాలెం ప్రార్థన మందిరంలో శాలెం గాస్పల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కె. మాణిక్యం, పాస్టర్ పి.జకర్య ఆధ్వర్యంలో గత కొన్నేళ్లగా నిర్వహిస్తున్న బైబిల్ క్లాస్ సేవకుల సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎం జె కె మోహన్ మాట్లాడుతూ దానాలలో కెల్లా వస్త్ర దానం అత్యంత ఘనమైనదని అన్నారు. నీకు కలిగిన దానిలో నుండి నీ పొరుగు వానికి అందించడమే క్రీస్తు యేసు బోధనల సారాంశమని ఆయన అన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుకునే మన భారత దేశంలో అన్ని కులాల మతాల జాతులు వారు క్రిస్మస్ పండుగను సమైక్యంగా జరుపుకుంటారన్నారు. అనంతరం 60 5 మంది పాస్టర్లకు సేవకురాండ్రకు దాత ఎం జె కె మోహన్ ప్రభావతి దంపతులు ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన నూతన వస్త్రాలను ఎంజెకె. మోహన్ ప్రభావతి, పాస్టర్ కె. తిమోతి, రిటైర్డ్ టీచర్ సిహెచ్ భాస్కరరావు, బ్రదర్ కే. మాణిక్యం, పాస్టర్ జెకర్యా, పాస్టర్ రవి చేతుల మీదుగా దైవ సేవకులకు సేవకురాండ్రకు అందించారు.

అచ్చియపాలెంలో దుప్పి హల్‌చల్

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అచ్చియపాలెం గ్రామంలో శనివారం అడవి నుండి తప్పిపోయిన దుప్పి పిల్ల హల్‌చల్ చేసింది. అదే గ్రామానికి చెందిన ఎంకమ్మ కుక్కల్ని తరుము తుండగా దుప్పిని గమనించి కుక్కల బారి నుండి దుప్పిని రక్షించి దానికి వైద్య అందించి భద్రపరిచింది. స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఏపీ జెఏసి కో-చైర్మన్‌గా ప్రమీల రాణి

విశాలాంధ్ర-గోకవరం : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం భాగస్వామిగా దాదాపు 100 ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంగా ఉన్న ఏపీజేఏసీ అమరావతిలో.. ప్రత్యేకంగా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా.. తూర్పుగోదావరి జిల్లా ఏపీ. జె.ఎసి విభాగం ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో జిల్లా కో -చైర్మన్ గా గోకవరం మండలం రంప యర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధాన ఉపాధ్యాయురాలు జి. ప్రమీల రాణి ని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏపీ జె ఎసి ట్రైనింగ్ కాలేజ్ రాజమండ్రి రెవెన్యూ భవన్ లో ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సంఘ సభ్యులు పాల్గొని ప్రమీల రాణి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

కే సావరంలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు తో గ్రామ ప్రజల దంత సమస్యలు తీర్చిన భీమవరం విష్ణు డెంటల్ కాలేజీ యాజమాన్యానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు సర్పంచ్ నార్ని రామకృష్ణ తెలిపారు. శనివారం కె సావరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దంతాలకు సంబంధించిన సుమారు 70 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యం శిబిరంలోనే నిర్వహించినట్లు దంత వైద్యులు చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, వీఆర్వో సోమిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కాపా నాగరాజు, ఎం ఎల్ హెచ్ పి సంధ్యారాణి, ఏ ఎన్ ఎం రత్నకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్ర కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్రప్రజల్లో క్రీడా స్ఫూర్తి నింపడానికి, గ్రామీణ ప్రాంతాల్లో వున్న క్రీడాకారులను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దోహద పడుతుందని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అన్నారు. శనివారం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర స్టేట్ లెవెల్ టోర్నమెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటల పోటీలకు సంబంధించిన సామగ్రిని సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.వి.యస్.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు, సిబ్బంది అందరి సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు సిహెచ్ సక్సేనా రాజు, శారదా జోత్స్న, మండల పిఈటి లు, పీడీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ స్థాయి కస్టోడియన్ అధికారులు హాజరయ్యారు.

ప్రజా వ్యతిరేక పాలన అవలంబిస్తున్న జగన్

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజా వ్యతిరేక పాలన అవలంబిస్తున్న జగన్మోహన్ రెడ్డి పాలనకు అంతం పలికేందుకు ప్రజలందరూ ఎదురు చూస్తున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. గత 90 రోజులుగా బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, మహాశక్తి రథయాత్రను జగ్గంపేట నియోజకవర్గంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపు శనివారం జగ్గంపేటలో జరిగింది. ముఖ్య అతిథిగా నెహ్రూ హాజరై మాట్లాడుతూ మహిళలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, మహిళా శక్తి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దాపర్తి సీతారామయ్య, పీలా మహేష్, గుండా శివప్రసాద్, దేగల సత్తిబాబు, నేదురి గణేష్, రాయి సాయి, కింగం రామకృష్ణ, కొండ్రోతు శ్రీను, సాంబత్తుల చంద్రశేఖర్, మారిశెట్టి రాధా, మహిళా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చెరుకూరి

విశాలాంధ్ర - జగ్గంపేట : రక్తం అవసరమైన వారికి వెంటనే బ్లడ్ డోనేట్ చేసి మానవత్వం చాటుకున్నారు జగ్గంపేటకు చెందిన చెరుకూరి జయరాజ్. జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన అడబాల పార్వతి రాజమహేంద్రవరం హాస్పటల్‌లో చికిత్స పొందుతుంది. ఆమెకు అర్జెంట్‌గా బ్లడ్ అవసరం రావటంతో జగ్గంపేటకు చెందిన జయరాజ్‌ను బ్లడ్ ఇవ్వమనీ అడగటం జరిగింది. ఆయన వెంటనే స్పందించి రాజమండ్రి వెళ్లి రక్తదానం చేశారు. ఆయన సేవను కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అభినందించారు.

ఘనంగా ముగిసిన ఉజ్జీవ మహా సభలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన 32వ వార్షిక మహాసభలు, క్రిస్టమస్ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సభలు ముగింపులో భాగంగా నాల్గవ రోజు నిర్వహించిన గ్రాండ్ క్రిస్టమస్ వేడుక ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. అసోసియేషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ పి. ఆనంద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజక వర్గ వైఎస్ఆర్సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు తదితరులు విచ్చేసి పాల్గొన్నారు. హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ సామర్లకోటలో క్రైస్తవ సమాదుల తోటకు స్తలకొరత ఉన్నందున దానికి సహకరించాలని హౌసింగ్ చైర్మన్ దొరబాబుకు అసోసియేషన్ నాయకులు విన్నవించగా దానికి చర్యలు చేపడుతున్నట్టు దొరబాబు చెప్పారు.

ఆకట్టుకున్న క్రిస్టమస్ ఆరాధన : ఐక్య క్రిస్టమస్ కార్యక్రమంలో క్రైస్తవ ప్రజల కొవ్వొత్తుల ఆరాధన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు కొవ్వొత్తులను వెలిగించి బాలుడైన యేసుక్రీస్తు జననాన్ని గుర్తు చేసుకుంటూ ఆరాధన జరపగా కొవ్వొత్తుల కాంతులతో జూనియర్ కళాశాల గ్రౌండ్ వెలిగిపోయింది.

నూతన అధ్యక్షులుగా డాక్టర్ సాల్మన్ రాజు : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ 2024 సంవత్సరానికి గానూ నూతన అధ్యక్షులుగా రెవ, డా ఎం సాల్మన్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాజులూరు : పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రం ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం కాజులూరులో మండల గ్రామాలకు చెందిన 276 మంది లబ్దిదారులకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల పట్టాలను మంత్రి వేణుగోపాలకృష్ణ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఇనామ్, లంక భూముల రైతులకు బారీమేలు చేసేలా ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న జగనన్నను ప్రజలు మరోసారి సీఎంను చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, మండల తహసీల్దారు. సాయిసత్యనారా యణ, ఆర్ఎస్ఐ వేగేశ్వరావు, గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని, పోతురాజు బాబురావు, దంగేటి అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతు తెలపండి

విశాలాంధ్ర - కలిదిండి: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు తోనే సాధ్యమని ప్రజలు సహ కరించి టిడిపికి మద్దతు తెలపాలని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని పెదలంక గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలో ప్రకటించిన 6 పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు దుగ్గిరాల పరమేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.